# సత్యవాక్కు

## the word of truth

క్రైస్తవ మాసపత్రిక

OCTOBER - 1996

# సంక్షిప్త వార్తలు

సెప్టెంబరు నెల సువార్తికుల సదస్సు 25వ తేదీన పెద్దాపురంలో క్షేమాభివృద్ధి కరంగా జరిగెను. వివిధ జిల్లాలలో క్రీస్తు రాజ్యవ్యాప్తిలో సమయము అసమయము అను భేదము ఎరుగని సువార్తికుల సమక్షంలో " బైబిలు దేవుని వాక్యమని ఏల నమ్మవలెను?" అను అంశము చర్చించబడెను. సోదరులు యన్. మోజెస్, ఇ.కె.వి. ప్రసాదరావు, ఆర్.సమూయేలు, యన్.ఏలియా, వి.హిట్లర్, పి.సామ్యూల్, పాల్ గూటం, వి.చిన్నయ్య, దేవరపు సత్యం మరియు జాషువాగూటం గార్లు పై అంశముపై మంచి వర్తమానమును అందించిరి.

బైబిలు 66 పుస్తకములు కలిగిన చిన్న గ్రంధాలయము. 1600 సంవత్సరముల కాలములో 40 మంది మనుష్యులు దీనిని వ్రాసినను దీని గ్రంధకర్త దేవుడేయని లేఖకులు సాక్ష్యమిచ్చిరి. "దైవావేశము వలన" లేఖనము వ్రాయబడినదని పౌలు చెప్పెను (2తిమో 3:16-17). "మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింప బడిన వారై దేవుని మూలముగ పలికిరి" అని పేతురు వ్రాసెను. (2పేతు 2:21).

సృష్టిక్రమము, ప్రవచనములు నెరవేర్పు, దాని ఐక్యత, దాని వ్యాప్తి, అందు వ్రాయబడిన చరిత్ర, దాని పలుకుబడి, అది బోధించుచున్న దేవుని రక్షణ. సంకల్పము, అది మానవునిలో తీసుకొని వచ్చుచున్న మార్పు మరియు జ్ఞానము, నాశనము కాని దాని తత్వము అది దైవ గ్రంధమని ఋజావు చేయుచున్నవి, యిది ఆధునిక విషయములను మానవులకందించుచున్న మిక్కిలి పురాతన గ్రంథము. బైబిలు బోధించు ప్రదేశములు, ఆధునిక విజ్ఞాన శాస్త్రసంబంధ విషయములు, చరిత్ర, భూగోళ శాస్త్రంతోను, విజ్ఞాన శాస్త్రముతోను మరియు ప్రపంచ చరిత్రతోను ఏకీభవించుచున్నవి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884-63722

Editor : J.C.CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 17 అక్టోబరు 1996 సంచిక 3

### సంపాద కీయం.

## ఆరాధనలో వాద్య సంగీతమా ?

( Instrumental Music in Worship? )

క్రీస్తు సంఘానికీ, మత శాఖలకు ఉన్న వ్యత్యాసములలో ఆరాధనలో వాద్య సంగీతమొకటి. లేఖనములు మౌనియైన చోట మనమును మౌనులమై యుండాలి. అందును బట్టి యేసుప్రభువు యొక్క అధికారము (అనుమతి) బొందని వాద్యములకు క్రైస్తవారాధనలో తావులేదు. కీర్తనల ద్వారా దేవుని ఆరాధించుటలో వాద్యములు సహకారి కాజాలవు. ఆరాధన యొక్క ముఖ్య ఉద్దేశ్యాన్ని అవి నెరవేర్చవు. ఏలయనగా ఆరాధన అంటే వాద్య సంగీతము కాదు.

ఆరాధన ఒక వ్యక్తి చేస్తాడు, పరికరము కాదు. మిగతా ఆరాధనకులను రంజింపజేయడానికి మరొకడు చేసేది యేదీ ఆరాధన కాదు. ఆరాధన వ్యక్తిగతమైనది, అంతరంగికమైనది, ఆత్మీయమైనది, హృదయపూర్వకమైనది, భక్తి పూరితమైనది.

క్రొత్త నిబంధన ఆరాధనను అపార్ధము చేసికొనుట వలన మానవులు ఆరాధనలో వాయిద్యములు ప్రవేశపెట్టారు. దేవుడు ఆత్మయై యున్నాడు, మనం ఆయనను ఆత్మతో ఆరాధించాలి. ఆత్మయైన దేవుని భౌతిక వస్తువులతో, పరికరములతో ఆరాధించగలమని తలంచుట పొరబాటు. అట్టివారు "దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమ పరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపలేదు, గాని తమ వాదముల యందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకారమాయెను, తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి" (రోమా 1:21-22).

దేవుడు ఆత్మయై యున్నాడు! అందువలన భక్షించుటకు జంతుబలులు, ఆఘ్రాణించుటకు సాంబ్రాణి పొగలు, ఆహ్లాదించుటకు వాద్య సంగీతము ఆయనకు అక్కరలేదు. జంతు బలులు వగయిరా, దేవునికి కావాలేమో యని యూదులు తలంచేవారు. గాని దేవుడిట్లనుచున్నాడు: "నీ యింటనుండి కోడెనైనను, నీ మందలో నుండి పొట్టేళ్ల నైనను నేను తీసికొనను. అడవి మృగములన్నియు, వేయి కొండల మీది పశువులన్నియు నావే కదా!.... లోకమును దాని పరిపూర్ణతయు నావే. నేను ఆకలి గొనినను నీతో చెప్పను. వృషభముల మాంసము నేను తిందునా? పొట్టేళ్ల రక్తము త్రాగుదునా? దేవునికి స్తుతి యాగము చేయుము" (కీర్తన 50:9-14). అంతరంగ పురుషుని నుండి కలుగు భక్తి పూరితమైన ఆరాధనను దేవుడు కోరుచున్నాడు.

ఆరాధనలో ఆచారకర్మలను యేసు ప్రభువు ఖండించారు. హృదయము నుండి గాక పెదవులనుండియే కలుగు ఆరాధన వ్యర్థమని ఆయన చెప్పారు: "మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు.... ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘన పరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది ; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోప దేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించు చున్నారు" (మత్తయి 15:6-9).

దేవుడు ఆరాధనలో సంగీతమును కోరుచున్నాడు, గాని అది యంత్రములనుండి వచ్చునది గాక మానవ హృదయములో నుండి వచ్చు జిహ్వాఫలము. "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము. అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము'' (హెబ్రీ 13:15). యూదుల ఆరాధనలో వాద్యసంగీతముండెను గనుక క్రైస్తవారాధనలో వాద్యములుండ వచ్చని భావించుట ఆత్మీయారాధనలో వెనుకంజ వేసినట్లే యగును. సాంబ్రాణి పొగలు ఎంత సువాసన నిచ్చినను, వాద్య సంగీతము ఎంత వినసొంపుగా యున్నను, అవి ఆరాధన కాదు. వాద్య పరికరములనుండి వచ్చు సంగీతము యాంత్రికమే గాని వ్యక్తిగతము కాదు, వాటినుండి కలుగునది అర్థరహితమైన శబ్దమే గాని, భావ పూరితమైన మాటలు కావు.

ఇంతకీ దేవుడు కోరుచున్నదేమిటి? దావీదు ఇట్లను చున్నాడు: "ప్రభువా, నీవు బలిని కోరువాడవు కావు, కోరిన యెడల నేను అర్పించుదును. దహనబలి నీ కిష్టమైనది కాదు. విరిగిన మనస్సే దేవుని కిష్టమైన బలులు" (కీర్తన 51:16,17). యిది ఎరిగి, "ప్రభువా, నానోరు నీ స్తుతిని ప్రచుర పరచునట్లు నా పెదవులను తెరువుము." "అప్పుడు నా నాలుక నీ నీతిగూర్చి ఉత్సాహగానము చేయును" అని దావీదు ప్రార్థించాడు (కీర్తన 51:15,14). క్రొత్త నిబంధన ఆరాధన దేవుని స్తుతించడానికి, ఒకరి నొకరు బోధించుకోడానికి, హెచ్చరించుకోడానికి, హృదయ పూర్వకమైన ఆత్మీయ భావములను వ్యక్తపరచడానికి ఉద్దేశించబడినది (హెబ్రీ 13:15; కొలస్స 3:16; యాకోబు 5:13). వాద్యములు ఇవేమీ నెరవేర్చలేవు.

మానవజాతి చరిత్రలో వాద్య పరికరములను కయీను సంతతి ప్రవేశ పెట్టిరి. అంతేకాదు వారు పదునుగల రాగి, ఇనుప పనిముట్లును నరహత్యను ప్రవేశపెట్టిరి (ఆది 4:16-24). క్రైస్తవారాధనలో విశ్వాస భ్రష్టత్వములో పడిన కేథలిక్‌లు వాద్యములనుప్రవేశ పెట్టిరి. కయీను సంతతి క్రియల వలెనే కేథలిక్ సంఘ క్రియల పర్యవసానము ఏమంత శ్రేష్టమైనదికాదు; ఆత్మీయమైనదికాదు.

కయీనును చంపిన హేబేలు నకు ప్రతిగా ఆదాము హవ్వలకు దేవుడు షేతు అను కుమారుని అనుగ్రహించెను. "మరియు షేతునకు కూడా కుమారుడు పుట్టెను. అతనికి ఏనోషను పేరు పెట్టెను. అప్పుడు యెహోవా నామమున ప్రార్థన చేయుట ఆరంభమైనది" (ఆది 4:25-26). క్రైస్తవ ఆరాధనలో మొదట్లో కేథలిక్‌లు, తరువాత డినామినేషన్లు వాద్య సంగీతమును ప్రవేశపెడితే, మానవ కల్పిత సంగతులను బోధలను విసర్జించి దేవుని వాక్యములో ఉన్నది ఉన్నట్లు గానే ఆయన నారాధింతుము రండనే పిలుపు క్రీస్తు సంఘములతో ఆరంభమైనది!!

-జాషువా గూటం

గమనిక: 1996 ఆగష్టు నెలలో అంతర్వేది పాలెంలో జరిగిన సువార్తికుల సదస్సులో "క్రైస్తవ ఆరాధనలో వాద్య సంగీతము నుపయోగింప వచ్చునా?" అను అంశముపై పలువురు సువార్తికులు అందించిన వర్తమానములను ఈ సంచికలో చదువరుల క్షేమాభివృద్ధి నిమిత్తము ప్రచురించు చున్నాము.

-ఎడిటర్

# దైవ చిత్తానుసారమైన ఆరాధన

**( Worship according to God's Will )**

దేవుడు ఆరాధ్య దైవము. ఆయన పరలోకమందును, భూమియందును ఆరాధింపబడు దేవుడు. ఆరాధన ఆయన చిత్తానుసారమై యుండవలెనని పరిశుద్ధ గ్రంధము చెప్పుచున్నది. పరిశుద్ధ గ్రంధములో వివిధరకాల ఆరాధనలు జరిగినట్లు మనం చూడగలం. అందు దేవుని చిత్తానుసారమైన ఆరాధన ఏది? కానిది ఏది ?యని పరీక్షించి, దేవుని చిత్తానుసారమైన ఆరాధన జరిగించి పరలోక

రాజ్యం చేరవలసి యున్నది.

కయీను, హేబేలు ఏకగర్భ జనితులు, ఏక దేవుని ఆరాధితులు. కయీను వ్యవసాయదారుడు, హేబేలు గొర్రెల కాపరి. కొంతకాలము తరువాత కయీను తన పొలము పంటలో కొంత దేవునికి అర్పించెను. హేబేలు తన మందలో క్రొవ్విన వాటిని కొన్ని అర్పించెను. దేవుడైన యెహోవా హేబేలు బలిని అంగీకరించినను కయీను అర్పణను లక్ష్యపెట్టలేదు. కయీనుకు మిక్కిలి కోపము వచ్చెను( ఆది 4:1-5). ఈ అంశము అనేకమంది క్రైస్తవులను కలవర పెట్టుచున్నది. తన పంటలో కొంత కయీను అర్పించెను, తన మందలోని కొన్నిటిని హేబేలు అర్పించెను. అయితే దేవుడు హేబేలు అర్పణను ఎందుకు అంగీకరించెను? కయీను అర్పణను ఎందుకు నిరాకరించెను? దీనికి జవాబు బైబిలు మాత్రమే చెప్పగలదు.

"విశ్వాసమును బట్టి హేబేలు కయీను కంటె శ్రేష్ఠమైన బలిని దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్య మిచ్చినపుడు అతడు విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు విశ్వాసము ద్వారా మాటలాడు చున్నాడు" (హెబ్రీ 11:4). దేవుని మాట వినుట శ్రేష్ఠము. "వినుట వలన విశ్వాసము వలన కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును " (రోమా 10:17).

అయితే హేబేలు విని దానిని బట్టి విశ్వసించి దేవుని చిత్తాను సారమైన బలిని అర్పించి దేవునిచేత అంగీకరింపబడెను. కయీనయితే విశ్వసించక తన ఇష్టానుసారమైన అర్పణ అర్పించెను. గనుక దేవుడతని అర్పణను అంగీకరించలేదు. ఈనాడు కూడా అనేకులు దైవ చిత్తానుసారమైన ఆరాధనను తిరస్కరించి, మానవకల్పిత ఆరాధనలు జరిగించి దేవునికి దూరమగు చున్నారు. అట్టి కొన్ని ఆరాధనలను గూర్చి తెలిసికొనుట ఎంతైనా అవసరం.

1. తెలియని ఆరాధన :- అపొస్తులుడైన పౌలు ఏథెన్సు పట్టణస్థుల ఆరాధనను గూర్చి యిట్లు చెప్పెను: "నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచు చుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దాని మీద తెలియబడని దేవునికి అని వ్రాయబడి యున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో దానినే మీకు ప్రచుర పరచు చున్నాను" (అపొ.కా. 17:23). ఇది తెలియని ఆరాధన. ఇది దేవుని చిత్తానుసారమైనది కాదనియు, నిరూప యోగ్యమైనదనియు పైవాక్యము రుజువు చేయుచున్నది.

2. ఆచారపు ఆరాధన:- గాజా దేశపు ఆర్థికమంత్రియైన ఐతియోపీయుడైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేము వచ్చి, అతడు తిరిగి వెళ్ళుచు తన రథము మీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథమును చదువుచుండెను (అపొ.కా. 8:27,28). ఇది యూదులు ప్రతియేటా చేయు ఆచారపూర్వక ఆరాధనయై యున్నది. దూత చేత ప్రేరేపింపబడిన ఫిలిప్పు అతనిని కలసికొని నపుంసకుడు చదువుచున్న లేఖనము ననుసరించి అతనికి సువార్త ప్రకటించెను. అప్పుడు నపుంసకుడు ఫిలిప్పు చేత బాప్తిస్మము పొంది సంతోషించుచు ఇంటికి వెళ్ళెను(అపొ.కా. 8:34,39). దీనిని బట్టి మనకేమి బోధపడుచున్నది.? తాను యింతకు పూర్వం చేసిన ఆరాధన ఆచారపూర్వక మైనదనియు క్రొత్త నిబంధన కాలములో యిది నిష్ప్రయోజనమైన దనియు ఫిలిప్పు బోధించిన సువార్త వలన గ్రహించి మార్పుచెంది బాప్తిస్మము పొందెను.

3. వ్యర్థమైన ఆరాధన:- ఈనాటి క్రైస్తవ లోకమును కలవర పెట్టుచున్న ఆరాధనలో యిది ప్రధానమైనది. అనేక మతశాఖల వారు ఆరాధనలో మానవ కల్పితమైన అనేక పద్ధతులు కల్పించి ఆరాధించు చున్నారు. అట్టి వాటిలో ముఖ్యమైనది ఆరాధనలో వాయిద్యములు వాయించుట. ఇది దేవుని చిత్తమునకు విరుద్ధమైనది, ఇట్టి వాయిద్యములను గూర్చి

కూలంకుశముగా తెలిసికొనుట యెంతైనా అవసరం.

వాయిద్యములు ధర్మశాస్త్ర కాలములో అందరు వాయించిరి. "దావీదును ఇశ్రాయేలీయులందరును తమ పూర్ణశక్తితో దేవుని సన్నిధిని పాటలు పాడుచు, సితారాలను స్వరమండలములను, తాళములను వాయించుచు బూరలు ఊదుచుండిరి" (1దిన్వ. 13:8). ఇట్లు కొంతకాలము జరిగిన తరువాత యీ విధానము మార్చబడి యెహోవా దావీదుతో ఒక నిబంధన చేసెను: "మరియు దావీదును దావీదు రాజునకు దీర్ఘదర్శియైన గాదును ప్రవక్తయైన నాతానును చేసిన నిర్ణయము చొప్పున యెహోవా మందిరములో తాళములను స్వరమండలములను సితారలను వాయించుటకై అతడు లేవీయులను ఏర్పాటుచేసెను. ఆలాగు జరుగవలెనని యెహోవా తన ప్రవక్తల ద్వారా ఆజ్ఞాపించి యుండెను. దావీదు చేయించిన వాయిద్యములను వాయించుటకు లేవీయులును, బూరలు ఊదుటకు యాజకులును నియమింపబడిరి" (2దిన్వ. 29:25-27). ఈ నిబంధన అమలుపర్చబడి క్రీస్తు కాలమున రద్దు చేయబడెను.

సత్యమైన ఆరాధన గ్రహించని మతశాఖల వారు దావీదు వాయించెనుగదా, మనమెందుకు వాయించకూడదని వితండవాదము చేయుచుందురు. ఇది పనికిమాలిన వాదన. వారి ఆలోచన ప్రకారమైతే, దావీదు చేసిన పనులన్నియు మనము కూడ చేయవలెను కదా? దావీదు గొల్యాతును సంహరించెను, మనమును మరొక గొల్యాతును సంహరింపవలెనా? అతడు ఇశ్రాయేలు రాజ్యమును పాలించెను; మనమును పాలించవలెనా? దావీదు ఉరియా ను చంపించి అతని భార్య బత్షేబతో శయనించి (2సమూ. 11:3,4, 14-17) పాపము చేసెను. "....అయితే దావీదు చేసినది యెహోవా దృష్టికి దుష్కార్యముగా వుండెను" (2సమూ. 11:27). మనము కూడా అట్టి దుష్కార్యమును చేయవలెనా? దావీదు వాయించినాడు గనుక మనమును వాయించవలెననుట ఎంతటి వెర్రితనము? అదియును గాక యెహోవా, దావీదు వలెనే పిచ్చి వాయిద్యములు కల్పించుకొనవద్దని తన ప్రవక్తద్వారా ఆదేశించెను. "స్వరమండలముతో కలసి పిచ్చిపాటలు పాడుచు

దావీదు వలెనే వాయించు వాయిద్యములు కల్పించుకొందురు" (ఆమో.6:5). ఇట్టి యెహోవా ఆజ్ఞను తిరస్కరించి వాయిద్యములు వాయించుట తండ్రి చిత్తమునకు విరుద్ధమైన పాపము చేయుటయే.

## సంగీతము

మరియు, ఆరాధనలో వాయిద్యములు వాయించువారు క్రొత్త నిబంధనలోని ఎఫె. 5:19, కొల.3:16లోని "సంగీతము" అనుపదమును చూపి తమ కల్పిత ఆరాధనను సమర్పించు కొనుచున్నారు. అంతేగాక యీ వాదనతో సువార్తికులను గందరగోళ పరుస్తున్నారు. ఏలయన? సంగీతము అనగా "వాయిద్యములు" అని తలంచు చున్నారు. సంగీతము అనగా వాయిద్యములు కానేకావు. అందువలన "సంగీతము" అను అంశమును గూర్చి కూలంకుశముగా తెలిసికొనుట అత్యంతావశ్యకమై యున్నది.

పై తెలిపిన రెండు వాక్యభాగములను బాగుగా పరిశీలించిన అందు సంగీతములో నిర్వర్తించ వలసిన దేవుని చిత్తమును 5 విధములుగా బయలు పర్చబడి యున్నది. సంగీతముతో 1. హెచ్చరించుట 2. కీర్తించుట 3. బోధించుట 4. బుద్ధిచెప్పుట 5. స్తుతించుట. దేవుడు, సంగీతము ద్వారా బోధించి, హెచ్చరించి, బుద్ధిచెప్పి, కీర్తించి స్తుతించమని ఆ వాక్యముల ద్వారా తన చిత్తమును వెల్లడించి యున్నాడు. అయితే మద్దెల బోధించగలదా? కంజెర కీర్తించగలదా? సితారా స్తుతించగలదా? వాయిద్యములు యిట్టివేమియు చేయలేవు. కారణం? అవి నిర్జీవ వస్తువులు. ఇట్టి నిర్జీవ వస్తువులతో గాక "జిహ్వాఫలము" అర్పించమని పరిశుద్ధాత్ముడు వెల్లడించి యున్నాడు. కాబట్టి "ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము. అనగా నాలుక ద్వారా స్తుతించమని దేవుడాదేశించు చున్నాడు. నాలుకతో గాక మరిదేనితో ఆరాధించకూడదనియు దేవుని చిత్తమై యున్నది. ఉదా:- దేవుడు నోవహుతో "చితిసారకపు" మ్రానుతో ఓడ సిద్ధపర్చుమనెను. అట్లు గాక మరి

ఏయితర ప్రమాణుతో చేసినను దేవుని ఆజ్ఞకు వ్యతిరేకమే. ఆలాగుననే జిహ్వాఫలముతో గాక మరిదేనితో ఆరాధించినను అది దేవుని చిత్తమునకు విరుద్ధమే. మరైతే సంగీతమనగానేమి?

సంగీతమునకు రెండు అర్ధములు గలవు. 1. భావార్ధము 2. బాషార్ధము.

1. భావార్ధము:- సంగీతము అనగా మన హృదయములోని తలంపులను స్వరపేటికల ద్వారా నాలుక (జిహ్వ)తో లయబద్ధముగా నాలపించుటయే. ఉదా:- "నడిపించు-నానావ-నడిసాంద్రమున- దేవా"; ఈ పదములను రాగయుక్తముగా పలికిన పాటయగును. ఇది సంగీతము. ఆ మాటలను విడివిడిగా పలికిన గద్యమగునే గాని పద్యముకాదు, సంగీతము అసలు కాదు, కానేరదు.

2. భాషార్ధము:- సంగీతము అనునది సంస్కృత పదము. సంస్కృత భాషలో వ్యాకరణ సంబంధమైన "ఉపసర్గలు" వుండును. ఇవి ఒకటి లేక రెండు అక్షరములతో ఏర్పడును. అనగా ఒక్కొక్క పదమునకు ముందు ఉపసర్గ చేరిన ఆపదము యొక్క అర్ధము మారుట, వేరే ఆర్ధమునిచ్చుట, వ్యతిరేకార్ధము నిచ్చుట లేదా అంతకు ముందు వున్న అర్ధమును మిక్కిలి బలపర్చుట జరుగును.

ఉధా:- 1. హారము:- "హారము" అను పదమునకు "సం" అను ఉపసర్గ చేరిన "సంహారము" అగును. హారము అనగా మెడలో ధరించు దండ; సంహారము అనగా చంపుట. ఇక్కడ అర్ధము మారిపోయినది.

2. రాగము:- "రాగము" అను పదమునకు "అను' యనే ఉపసర్గ చేరినపుడు అనురాగము అగును. రాగము అనగా ఒక పదమును దీర్ఘముగా ఆలపించుట. అనురాగము అనగా ప్రేమ. వేరే అర్ధము వచ్చినది.

3. సత్యము:- "సత్యము అనుపదమునకు "అ" అను ఉపసర్గ చేరిన "అసత్యము" అగును. సత్యము అనగా నిజము. అసత్యము అనగా అబద్ధము. ఇచ్చట వ్యతిరేకార్ధము వచ్చినది.

4. జీవము:- "జీవము" అను పదమునకు "స" అను ఉపసర్గ చేరిన "సజీవము" అగును. జీవము అనగా జీవించునది. దీనికి మరణము కలదు. సజీవము అనగా మరణము లేనిది. అసలు అర్ధమును ఎంతో బలపర్చినది.

ఈ మాదిరిగానే గీతము అను పదమునకు "సం" అను ఉపసర్గ చేరిన "సంగీతము" అగును. గీతము అనగా పాట. సంగీతము అనగా మధురమైన పాట. కనుక సంగీతమనగా శ్రావ్యమైన పాటయే గాని వాయిద్యములు కావు. ఇట్టి సత్యమును గ్రహించక ఆరాధనలో వాయిద్యములు వాయించు చున్నారు. ఇట్టి ఆరాధనను యేసుప్రభువు వ్యర్ధమైన ఆరాధన యని చెప్పెను. "ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని, వారి హృదయము నాకు దూరముగా నున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్ధముగా ఆరాధించు చున్నారు" (మత్త 15:9). కనుక యీ ఆరాధన దేవుని చిత్తమునకు విరుద్ధమైనది.

4.సత్యమైన ఆరాధన:- "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను". యోహా. 4:24. ఆత్మతో అనగా మన పూర్ణహృదయము తోను పూర్ణఆత్మ తోను పూర్ణ మనస్సు తోను మన తండ్రియైన దేవుని ఆరాధించవలెను (మత్త 22:27). సత్యముతో అనగా వాక్యమే సత్యము( యోహా. 17:17). అనగా వాక్యానుసారముగా ఆరాధించవలెను. పెంతెకోస్తు దినమున సంఘములో మూడువేల మంది చేర్చబడిరి. వీరు అపోస్తుల బోధ యందును, సహవాసమందును రొట్టె విరుచుట యందును ప్రార్ధన చేయుట యందును ఎడతెగక యుండిరి " (అపొ.కా. 2:42). ఆదిమ సంఘము

ఆదివారము ఆరాధనకు కూడుకొని (అపొ.కా.20 :7). ఈ ఆరాధనలో 1. పాటలు పాడుట(ఎఫెసీ 5:19, కొలస్స 3:16). 2. ప్రార్థన చేయుట (అపొ.కా. 2:42,12:5, 1తిమోతి 2:1,8). 3. వాక్య ప్రకటన (1థెస్స 5:15). 4. ప్రభురాత్రి భోజనములో (రొట్టె విరుచుట) పాల్గొనుట (అపొ.కా. 20:7, 1కొరింధి 11:23,26). 5. కానుకులు పట్టుట (1కొరింధి 16:2, 2కొరింధి 9:7). జరుగును. ఇది సత్యమైనది; దేవుని చిత్తానుసారమైన ఆరాధన. ఇట్టి ఆరాధనను ఎడతెగక, అనగా ప్రతి ఆదివారము జరిగించవలెను. కాబట్టి మత్తయి 7:21లో చెప్పినట్లు దేవుని చిత్తానుసారము కాని అర్పణలు అర్పించువారు; మానవ కల్పిత ఆరాధన చేయువారు పరలోక మందు ప్రవేశింపరు గాని దేవుని చిత్తానుసారమైన "సత్యారాధన" జరిపించువారే ప్రవేశింతురు.

-జి. మార్క్ , నందిగామ.

## దేవుడు కోరునట్టి ఆరాధన

**( The Kind of Worship God Wants )**

మన ఆరాధన దేవుని సంతోష పరిచేదిగా ఉండాలంటే అయన కోరిన రీతిలో మనం అయనను ఆరాధించాలి. మనకిష్టమైన రీతిలో ఆరాధించాలని భావిస్తే అది స్వేఛ్ఛారాదన యగును. దేవుని వాక్యం యొక్క అధికారాన్ని బట్టి మనం ఆయనను ఆరాధించాలి. ఆరాధనలో ఆయన వాయిద్యములను కోరుచున్నాడా? అనేది మన ముందున్న ప్రశ్న.

అభిప్రాయాలను, మనోభావాలను, నిరర్ధకతత్వ జ్ఞానాన్ని ప్రక్కకు నెట్టి లేఖనాలు ప్రభోధించే సత్యాలను అనుసరించుటయే మానవాళి ఎదుటనున్న కర్తవ్యము. సంపూర్ణ గ్రహింపు యొక్క సకలైశ్వర్యము క్రైస్తవులు కలిగి యుండి క్రీస్తును స్పష్టముగ తెలిసి కొన్న వారై తమ హృదయములలో ఆదరణ పొందాలని

పౌలు కొలస్సయిలో నున్న పరిశుద్ధులకు వ్రాసెను (కొలస్స 2:2).

## యూదుల ఆరాధన, క్రైస్తవుల ఆరాధన మిళితం చేయరాదు

యూదుల ఆరాధనకు క్రైస్తవ ఆరాధనకు మద్య గల వ్యత్యాసాలను అపొస్తులులు తమ పత్రికలలో స్పష్టముగా, సరళమైన భాషలో వివరించారు. యూదా మతమును క్రైస్తవ్యమును కలిపి బోధిస్తూ ప్రజలను కలవర పరచుచున్న బోధకులు నేడు మాత్రమే కాదు, మొదటి శతాబ్దములో కూడ ఉండిరి. అందువలననే అపొస్తలులు పరిశుద్ధులను అనేక విధములుగ తమ పత్రికలలో హెచ్చరించిరి. "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు, కృపలో నుండి తొలిగి పోయి యున్నారు" (గలతి 5:4). నేడు పాత నిబంధనను అనుసరించాలని బోధించే వారికి పౌలు చెప్పిన ఈ మాట కనువిప్పు కలిగించాలి. పత్రికలన్నీ యిదే విషయాన్ని ఆనాటి క్రైస్తవులకు వివరించాయి, వివరిస్తూనే ఉన్నాయి. పాత నిబంధన క్రీస్తునందు కొట్టి వేయబడెనని పౌలు నిర్ద్వంద్వముగ వ్రాసెను. (2కొరింధి 3:14).

వాయిద్యములు యూదుల ఆరాధనలో ఉపయోగింప బడినవి. ఆ అజ్ఞాన కాలములలో, లోపమైన నిబంధన అమలులో నున్న కాలములలో, ఛాయయే గాని నిజస్వరూపము లేని కాలములో, బహుభార్యాత్వమును దేవుడు సహించిన కాలములో, ఆరాధనలో వాయిద్యములను కూడ సహించెను. క్రైస్తవారాధనలో ఆరు శతాబ్దాలు కాలం గడిచి పోయిన తరువాత 7వ వతాబ్దంలో మానవులు తమ స్వంత చిత్తముతో దేవుని వాక్యం యొక్క అనుమతి లేకుండ వారి ఆరాధనలో వాయిద్యమును ప్రవేశపెట్టిరి.

## క్రొత్త నిబంధన ఉపదేశము

పాడుటను గూర్చి క్రొత్త నిబంధన యందు 10వచనభాగాలు వ్రాయబడినవి:

మత్త 26:30,మార్కు 14:26,అ॥కా 16:25, రోమా 15:9, 1కొరింథీ 14:15, ఎఫె 5:19, కొలస్స 3:16, హెబ్రీ 2:12, హెబ్రీ 13:15, యాకోబు 5:13. పాడుట, వాయించుట ఈరెండు ఒకటి కాదు. నీవు పాడవలెనని ఆజ్ఞాపింపబడితివి. కీర్తన పుస్తకము సహాయముతో పాడినను, కీర్తన పుస్తకము సహాయము లేకుండా పాడినను నీవు దేవుని ఆజ్ఞనే జరిగించు చున్నావు. నీవు ఒక వాయిద్యమును వాయించుట ప్రారంభిస్తే దేవుడు ఆజ్ఞాపింపని వేరొక కార్యమును జరిగించు చున్నావు. నీవు పాడినప్పుడు నీపాట హెచ్చరిస్తుంది, బోధిస్తుంది, దేవుని కీర్తిస్తుంది, మరియు అది హృదయం నుండి రాగలదు. దేవుడు నీ హృదయమనే వాయిద్యమును కోరుచున్నాడు. మరే యితర వాయిద్యమును క్రైస్తవ ఆరాధనలో మానవుడు ఉపయోగించినను దానిని దేవుని వాక్యముతో కలుపు చున్నాడు. "ఎవడైనను వీటితో మరియేదైనను కలిపిన యెడల ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును" (ప్రక 22:18).

క్రొత్త నిబంధనలో ఎక్కడైనను వాయిద్యమునలను ఉపయోగింప కూడదని వ్రాయబడిందా? ఇది అనేకసార్లు వినబడే ప్రశ్న. ప్రభురాత్రి భోజనములో ద్రాక్షరసము వాడవలెనని లేఖనము చెప్పుచున్నది. నారింజరసమును వాడకూడదని వేరే చెప్పనవసరము లేదు. "ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును" (1కొరింథీ 14:15). ఆత్మతోను మనస్సుతోను పాడాలి గనుక వాయిద్యము అవసరంలేదని వేరే చెప్పనవసరములేదు.

ఎఫె 5:19 మరియు కొలస్స 3:16 వచనాలలో తెలుగు బైబిలునందు "సంగీతము" అను పదం కనపడుచున్నది. యిది ఆంగ్ల బైబిలులో "Psalms, Hymns and Spiritual Songs" అని వ్రాయబడింది. దీనికి గ్రీకు మూల పదాన్ని బట్టి సంగీతమును అంటే వాయిద్యాలను ఉపయోగించ వచ్చునని కొందరి వాదన. ప్రపంచ మందలి 47మంది అత్యుత్తమ గ్రీకు పండితులు కింగ్ జేమ్స్ వెర్షన్ బైబిలు (KJV) ను మూలభాషలోనుండి అనువదించిరి. ప్రపంచ మందలి 101 మంది అత్యుత్తమ గ్రీకు పండితులు ' రివైజ్డ్ వెర్షన్' ను అనువదించిరి.

మొత్తం 148 మంది అత్యుత్తమ గ్రీకు పండితులు ఎఫె 5:19, కొలస్స 3:16 వచనాలను "మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు" అని అనువదించిరి. వాయిద్యములు ఆరాధనలో ఉండాలని కోరువారు ఈ అనువాదకుల కంటే ఎక్కువ గ్రీకు భాషా పరిజ్ఞానం గలవారా? ఈ పదం ఆంగ్ల బైబిలు నందు సరిగ అనువదింప బడింది.

దేవుడు కోరునట్టిది గాత్ర సంగీతము. అది దేవుని ఆజ్ఞను నెరవేర్చు నట్టిది. అది దేవుని అధికార పూర్వకమైన అజ్ఞ. వాయిద్య సంగీతము నిర్జీవ నాదము. దాని వలన సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగదు. ఆయన కీర్తిని గానము చేయుట, జిహ్వాఫలము నర్పించుట, స్తుతియాగము చేయుట, ఆయన నామ సంకీర్తనము చేయుట, ఆత్మతోను మనస్సుతోను పాడుట, హృదయములో ప్రభువుని గూర్చి పాడుట అను ఈ దైవాజ్ఞలు నెరవేర్చలేని వాయిద్యములు నిష్ప్రయోజనములు. వాటిని ఆరాధనలోనికి తెచ్చువారు అపవాది సంబంధులు.

- E. K. V. ప్రసాదరావ్, చెన్నూరు.

## క్రైస్తవ ఆరాధనలో వాయిద్య సంగీతము ఉపయోగించ వచ్చునా?

## ( Should Instruments be used in Worship? )

ఈ అంశము ఎంతో ప్రాముఖ్యమైనది ఎందుకనగా నేటి క్రైస్తవ ప్రపంచములో అత్యధిక జనాభా ఆరాధనలో వాయిద్య సంగీతములు ఉపయోగించు చున్నారు. అయితే బైబిలు ప్రకారము ఆరాధనలో వాయిద్యములు ఉపయోగించ వచ్చునా? లేదా? పరిశీలించుదాం.

నేటి ప్రజలు బైబిలును సరిగా చదువక పోవుట వలన అనేకులు పొరబడు చున్నారు. అయితే "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడు నక్కరలేని

పనివానిగాను సత్యవాక్యమును సరిగా విభజించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్తపడుము" (2తిమోతి 2:15). బైబిలులో రెండు నిబంధనలున్నవి 1. పాత నిబంధన 2. క్రొత్త నిబంధన. పాత నిబంధన ప్రకారము యూదులు ఆరాధనలో బలులు, ధూపదీప నైవేద్యములు, పండుగలు, వాయిద్య సంగీతములు ఉన్నవి. ధర్మశాస్రము లేక పాత నిబంధన ఇశ్రాయేలీయులకు ఇయ్యబడిన చట్టము. ఆచట్ట ప్రకారంగా రాజైన దావీదు వాయిద్యములను ప్రవేశపెట్టెను. 2దినవృత్తాంతము 29:25, కీర్తనలు 81:1-4 ప్రకారము వాయిద్య సంగీతములు పండుగలు ఇశ్రాయేలీయులకు కట్టడి. అయినను దేవుని సంతోషపరచని స్థితిలో వారు ప్రవర్తించుటచే ప్రవక్తయైన ఆమాసు ద్వారా ఇలాపల్కుచున్నాడు: "మీ పాటల ధ్వని నాయొద్దనుండి తొలగనియ్యుడి, మీ స్వరమండల నాదము వినుటకు నాకు మనస్సులేదు." (ఆమోసు 5:23). మరలా ఇలా చెప్పుచున్నాడు: "స్వరమండలములతో కలసి పిచ్చిపాటలు పాడుచు దావీదు వలెనే వాయించు వాయిద్యములను కల్పించు కొందురు" (ఆమోసు 6:5).

## క్రొత్త నిబంధన వాగ్దానము

ఆనాటి ప్రజలు చేసిన ఆరాధన దేవునికి ఇష్టము లేనట్లుగా అర్ధమగుచున్నది. అంతేకాదు ఆధర్మశాస్త్రమును లేక నిబంధనను మార్చివేయ నిశ్చయించాడు. "ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను, యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి" (యిర్మియా 31:31-34). "ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవదానికి అవకాశముండ నేరదు" (హెబ్రీ 8:7). "ఆయన క్రొత్తనిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు, ఏది పాతగిలి ఉడిగి పోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" (హెబ్రీ 8:13).

ఇశ్రాయేలీయులకు ఇయ్యబడిన ధర్మశాస్త్రము లేక పాత నిబంధనను తీసివేసి సమస్త ప్రజలకు క్రొత్త నిబందన ఇవ్వాలని దేవుడు నిశ్చయించాడు.

మనము ఇశ్రాయేలీయులమా? కాదు. ధర్మశాస్త్రము మనకీయబడినదా? లేదు. దీని నెరుగక అనేక బోధకులు పొరబడుచున్నారు. దయచేసి ఎఫెసీ 2:11-16 చదవండి. అన్యజనులైన వారికి ధర్మశాస్త్రము ఇవ్వలేదు. ధర్మశాస్త్రము కలిగిన వారైనను "ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు మూలముగా ఏమనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడును" (రోమా 3:19); మరియు ధర్మశాస్త్రము చేత ఎవడును దేవుని ఎదుట నీతి మంతుడని తీర్చబడడు అను వ్రాత రూపకమై ఆజ్ఞల వలన, మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను ఉండిన పత్రమును (ధర్మశాస్త్రము) సిలువకు మేకులతో కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచి వేసి, మనకు అడ్డము లేకుండా ఎత్తి వేసెను అని కొలస్స 2:13-15 నందు వ్రాయబడి యున్నది. 2కొరింధీ 3:14,15 చదవండి.

క్రొత్త నింబధన ఆరాధనలో "దేవుడు ఆత్మగనుక ఆయన ను ఆరాధించు వారు ఆత్మ తోను సత్యముతోను ఆరాధించవలెను(యోహాను 4:24). ఆరాధనలో గాత్ర సంగీతమే గాని వాయిద్య సంగీతమును దేవుడు కోరినట్లు లేఖనములలో లేదు. యేసు క్రీస్తు ఆయన శిష్యులు 'కీర్తనలు పాడిరి' (మత్తయి26:30). పౌలు, సీల దేవునికి కీర్తనలు పాడిరి (అపొ.కా16:25) 'నీనామ సంకీర్తన చేయుదును' (రోమా15:9). ఇలా అనేక లేఖనములు పాడవలెని చెప్పు చున్నవి.

## ఎందుకు పాడవలెనని దేవుడు కోరుచున్నాడు?

"ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువుని గూర్చి పాడుచు" (ఎఫెసి5:19). పాటల ద్వారా హెచ్చరిక కల్గునట్లు పాడవలెనని దేవుడు కోరుచున్నాడు. "ఒకని నొకడు బోధించుచు, బుద్ధి చెప్పుచు, దేవుని గూర్చి గానము చేయుచు, క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి" (కొలస్స3:16). ఇవన్నియు పాడుట ద్వారా జరుగును గాని వాయించుటద్వారా కాదు. వాయిద్యము బోధించ లేదు, బుద్ధి చెప్పలేదు, వాక్యము నివసింప

చేయలేదు. కావున ప్రియులారా మనుష్యుల చేతులతో చేయబడిన నిర్జీవ వాయిద్య సంగీతము గాక, దేవునిచే మన కనుగ్రహింపబడిన ఈ దేహము లోయున్న అద్భుతమైన మన స్వరములనెత్తి పాటల ద్వారా దేవుని ఆరాధించి, దేవునికి ప్రియులైన పిల్లలుగా దైవ దీవెనలు పొందుటకు ప్రయత్నింతము,

- వి. చిన్నయ్య, కడలి

- 0 -

## ఆరాధనలో వాద్య సంగీతమును ఉపయోగించ వచ్చునా?

క్రైస్తవ ఆరాధన ప్రారంభ దినములలో దైవారాధన యందు వాద్యములను పయోగించ వచ్చునా? లేదా? అను సమస్య ఉత్పన్నము కాలేదు. అపోస్తలుల కాలములోను, వారి మరణాంతరము కొన్ని శతాబ్దముల వరకును క్రైస్తవులలో ఈసమస్య పై భేదాభిప్రాయము లున్నట్టు ఎట్టి ఋజువును లేదు.

ఐతేకాలము గడచిన కొలది దేవుని ఆరాధించుటలో మానవ కల్పిత పద్ధతులు క్రమముగా వచ్చిచేరినవి. ఇట్టి సందర్భములో క్రైస్తవారాధనలో వాద్యసంగీతము యొక్క ఉపయోగమును గూర్చి మత నాయకులలో కొందరు వ్యక్తపరచిన భావములను పరిశీలించుట మంచిది.

క్రీ॥శ॥ 670. వ. సంవత్సరములో "పోపు" వైటాలియన్ అనునతడు పశ్చిమ ఐరోపాలోని కొన్ని సంఘములలో "ఆర్గన్" అను వాయిద్య పరికరమును ప్రవేశపెట్టినట్లు చరిత్ర చెప్పుచున్నది.

ప్రెస్బిటేరియన్ సంఘస్థాపనలో ప్రముఖ పాత్ర వహించిన జాన్ కాల్విన్ 33వ దావీదు కీర్తనపై తన వాఖ్యాన గ్రంధమందిట్లనెను: ధర్మశాస్త్ర సంబంధపు ఛాయలైన దీపస్తంభము మీదనున్న దీపమును వెలిగించుటయు, ధూపవేదికపై

ధూపము వేయుట అనువాటిని పునరుద్ధరించుటయు ఎట్లు తగదో అట్లే దేవునికి స్తుతి చెల్లించుట యందు వాద్యముల నుపుయోగించుట తగదు.

మెథడిష్టు వారిలో ఏడమ్ క్లార్కు అను గొప్ప వాఖ్యాన కర్తయిట్లనెను: సంగీతమును శాస్త్రమను భావముతో గౌరవించి అభినందింతును, కాని దేవుని మందిరములో వాద్య సంగీతమును హేయముగా నెంచి తృణీకరింతును. క్రైస్తవ్యమునకు ఆధార భూతుడైన వానిని ఆరాధించుట యందు కలిపి చెరుపు ఇట్టి పద్ధతులకు నా వ్యతిరేకము స్థిరముగా తెలుపుచున్నాను.

సంఘసంస్కర్తగా ప్రఖ్యాతి గాంచిన మార్టిన్ లూథర్--- "ఆరాధనలో ప్రవేశపెట్టిన "ఆర్గన్" బయలు దేవతకు గుర్తు" అని పలికెను.

బాప్టిస్టు బోధకులందరి కన్న గొప్పవాడుగా గుర్తింపబడిన చార్లెస్ స్పర్జన్ ఇంగ్లాండులో వారమునకు వేలాది ప్రజలకు 25 సంవత్సరములు బోధించినను ఆరాధనలో వాద్యసంగీతము నుపయోగించలేదు.

ఈ దిగువ అంశములను లేఖనములనుండి గమనించుదము:

(1) మోషే ధర్మశాస్త్ర ప్రకారము దేవుని ఆరాధన లోనికి వాయిద్య సంగీతము ఎవరు ప్రవేశపెట్టిరి? ఆమోసు 6:5; 2దినవృత్తాంతములు 29:25-29.

(2) ఇశ్రాయేలీయులు ఒక ఆవును లేక ఒక పందిని ఎందుకు అర్పించలేక పోయిరి? నిర్గ 12:1-6.

(3) నోవహు చితిసారకపు మ్రానును గాక వేరొక మ్రానుతో ఓడను ఎందుకు సిద్ధపర్చలేదు? ఆదికాండము 6:14,22.

క్రీస్తు, అపోస్తలులు, మరియు పౌలు, సీల ఎటువంటి వాద్య సంగీత పరికరములు ఉపయోగించిరి? మత్త 26:26-30 అపో॥కా॥ 16:25.

(4) ఆరాధన యందు వాయిద్యములు ఉపయోగించుట పాపమా? 1యోహాను 3:4.

పరిశుద్ధాత్ముడు వాయిద్య పరికరములు వాడవలెనని ఎన్నడైనా నడిపించెనా? లేక ఎవరినైనా ఆజ్ఞాపించెనా? అలాయైతే అది సత్యములో ఒక భాగమా? యోహాను 8:31-32; 16:13.

బూర, స్వరమండలము, సితార, తంబుర నాట్యము, పిల్లనగ్రోవి మ్రోగుతాళములు(కీర్తన 150:3-5) ఇవన్నియు రక్షణకు మూలమా? లేక జీవమునకు భక్తికి సరిపడునవా? (2పేతు 1:1-3).

(5) ఇస్సాకుకు బదులు ఇష్మాయేలును బలిగా అర్పింప వచ్చునా?, ఆది 22:1-5. ప్రభువు బల్లపై మాంసము, పాలు ఉంచుట యుక్తమా? ఉపయోగించవచ్చునా? మత్త 26:26-28.

(6) కుంటివానికి చేతికర్ర, దృష్టిమాంద్యము గలవానికి కంటి అద్దములు ఎట్లు సరిపడునో అట్లు పాడుటలో వాయిద్యము తోడ్పడును అన్నట్లయితే, సంఘము అంగవైకల్యము దృష్టి మాంద్యము గలదిగా అగుటలేదా? ఇట్టిది విభజనలను కలుగజేసి ప్రజలను సంఘమునుండి పారద్రోలలేదా? 2థెస్స 3:6; రోమా 8:9; రోమా 16:17.

అట్టివారు సత్యమును బోధించని శాఖలతో, యూదులు కేథలిక్కులతో వారు సహవాసము చేయుటలేదా? (మత్త 23:15, 2యోహా :9-11).

యూదా మతాచారములు, అనేకములు ఆకాలము మట్టుకే చెందినవి. క్రొత్త నిబంధన సంఘ ఆరాధనలో మతా చారములు ఒక భాగము కాదు. పశుబలులు, ధూపార్పణలు, వాయిద్య సంగీతము (కీర్తన 81:1-6).క్రైస్తవ ఆరాధనలో ఒక భాగము కావు.

మనము వాయిద్య పరికరములు సంఘములో ఉపయోగించినచో అది క్రొత్తనిబందన అధికారమును ధిక్కరించినట్లగును.

గాత్ర సంగీతములను గూర్చి క్రొత్త నిబంధనలో 8 వచన భాగములను పరిశీలిద్దాము:

(1) మత్తయి 26:30 (2) అ॥కా॥ 16:25 (3) రోమా 15:9 (4) 1కొరింథీ 14:15 (5) ఎఫెసీ 5:19 (6) కొలస్స 3:16 (7) హెబ్రీ 2:12 (8) యాకోబు 5:13. ఇవన్నియు పాడుటను గూర్చియే చెప్పుచున్నవి.

పాత నిబంధన నియమములో ఆరాదన యందు వాయిద్యములను వాయించవలెనని దేవుడాజ్ఞాపించినను, క్రొత్త నిబంధనలో ఆయన పావలెనని ఆజ్ఞాపించినప్పుడు మన మనస్సాక్షి ఎంత పవిత్రముగా నున్నను ఆరాధనలో వాయిద్యముల నుపయోగించుట తప్పే యగును. ఇప్పుడు ఆరాధనలో వాద్యముల నుపయోగిస్తే సంఖ్యాకాండము 20:12లో దేవుడు మోషే అహరోనులతో అన్నట్లు. "నన్ను నమ్మకపోతిరి" అని మనలను కూడ అనును. నాదాబు అబీహులు దేవుడు ఆజ్ఞాపింపని అన్యాగ్ని ఉపయోగించుట వలన శిక్షింపబడిరి (లేవీ 10:1-3). మరి మన గతియేమి? "మీకు బుద్ధి చెప్పుచున్న వానిని నిరాకరింప కుండునట్లు చూచుకొనుడి. వారు భూమి మీదనుండి బుద్ధిచెప్పిన వానిని నిరాకరించినప్పుడు తప్పించుకొనక పోయిన యెడల, పరలోకమునుండి బుద్ధి చెప్పుచున్నవానిని విసర్జించు మనము తప్పించుకొనక పోవుట మరీ నిశ్చయముగదా" (హెబ్రీ 12:25).

కావున ప్రియ మిత్రులారా,

"కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము. అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15). సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మ సంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు బుద్ధిచెప్పుచు (కొలస్స 3:16) ఆత్మయైన దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించుచు జిహ్వాఫలములర్పించుదము.

- **R.** సమూయేలు, అమలాపురం.

## ఆరాధనలో వాయిద్య సంగీతము ఉపయోగించ వచ్చునా?

తండ్రియైన దేవుడు కుమారుడైన క్రీస్తునకు ఇచ్చిన అధికారమును గూర్చి మత్త 17:5; 3:17; 28:18 వచనములలో చదవగా తండ్రియైన దేవుడు క్రీస్తునందు ఆనందించు నట్లుగాను, సమస్త అధికారము క్రీస్తునకు పరలోకములోను, భూమి మీద ఉన్నట్లుగా కనబడుచున్నది.

క్రైస్తవులు మోషే మాటకాదు, ఏలియా మాటకాదు గాని క్రీస్తుమాట వినవలెనని తండ్రియైన దేవుడు ఆకాశవాణి ద్వారా తెలిపియున్నాడు. క్రీస్తు రూపాంతము పొందినపుడు యిది మరి విశదముగా శిష్యులకు తెలిపెను. లూకా 24:44-49 వరకూ చదివినట్లయితే మోషే ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంధములు, కీర్తనలలోను వ్రాయబడియున్నయూ క్రీస్తులో పాతనిబంధన నెరవేర్పును తెల్పుచున్నది. క్రైస్తవ యుగములో దేవునిని ఆరాధించే విషయాన్ని పరిశుద్ధాత్మవలన మనకు రికార్డు చేయించ బడినది. దీనికి మనమెంతో ధన్యులము. 12మంది అపొస్తలులకు చెప్పని ఒక నగ్న సత్యాన్ని క్రీస్తు సమరయ స్త్రీతో "ఆరాధన" అనగా ఏమిటో బయలు పరచిరి. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను" (యోహా 4:24). మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంధములోను, కీర్తనలలోనున్న పాత ఆరాధనకు క్రీస్తు ప్రభువు స్వస్తిపలికి క్రొత్త ఆరాధనకు నాంది పలికిరి. పాత నిబంధనలో ఆరాధకునికి సంపూర్ణ సిద్ధి కలుగ జేయలేని అర్పణలు, బలులు, దిద్దుబాటు కాలము వచ్చువరకు విధింపబడి, అన్నపానములతోను, నానా విధములైన ప్రక్షాళనములతోను, సంబంధించిన శరీరాచారాములు మాత్రమై యుండెను.

## సర్వాధికారియైన క్రీస్తు- ఆయన వాక్యం

మరియు క్రీస్తు సంపూర్ణ అధికారముతో బోధించి నట్లుగాను, దయ్యములను వెళ్ళగొట్టి నట్లుగాను లేఖనములను చదవండి మత్త 7:28,29,

మార్కు 1:26,27. చదువరి, క్రీస్తునకు గల సంపూర్ణ అధికారముతో క్రైస్తవులు దేవుని ఏవిధముగా ఆరాధించాలో క్రొత్తనిబంధనలో వాక్యము ద్వారా చూపిరి:

1. క్రీస్తు ప్రభువు, అపోస్తలులు పాడిరి — మత్త 26:30.
2. పౌలు, సీలలు ప్రార్థించిరి, పాడిరి — అ.కా. 16:25.
3. ఆదిమ సంఘము స్తుతించిరి — అ.కా. 2:46.
4. స్తుతించిరి, సంకీర్తన చేసిరి, సంతోషించిరి — రోమా 15:19-11.
5. ఆత్మతో పాడిరి, మనస్సుతోను పాడిరి — 1కొరింథీ 14:15.
6. పాడుచు బోధించిరి, హెచ్చరించిరి — కొలస్స 3:16.
7. హృదయముతో పాడిరి, కీర్తించిరి — ఎఫెసీ 5:19.
8. సంతోషముతో పాడిరి — యాకోబు 5:13.
9. ఎల్లప్పుడును క్రీస్తునందు ఆనందించిరి — ఫిలిప్పీ 4:4.
10. స్తుతియాగము చేసి, జిహ్వాఫలము అర్పించిరి — హెబ్రీ 13:15.

వాయిద్యములను వాయించచూ పాడినట్లుగా పై వచనములలో అనగా క్రొత్త నిబంధనలో ఎచ్చటనూ వ్రాయబడలేదు.

## ప్రకృతి సంబంధులు-ఆత్మ సంబంధులు

"నేను చెప్పునదేమనగా! ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు శరీరేచ్ఛను నెరవేర్చరు. శరీరము ఆత్మకును, ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించు చున్నవి. గనుక మీరేమి చేయనిశ్చయింతురో వాటిని చేయకుందురు. మీరు ఆత్మచేత నడిపింపబడిన యెడల ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు'' (గల 5:16-18). "మనము ఆత్మననుసరించి జీవించువారమైతిమా ఆత్మను అనుసరించి క్రమముగా నడుచుకొందము'' (గల 5:25).

"ప్రకృతి సంబంధమైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు; అవి అతనికి వెర్రి తనముగా నున్నవి, అవి ఆత్మానుభవము చేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపజాలడు. ఆత్మసంబంధియైన వాడు అన్నిటిని వివేచించును గాని అతడెవని చేతనైననూ వివేచింపబడడు. ప్రభువు మనస్సు ఎరిగి ఆయనకు భోధింప గలవాడెవడు? మనమైతే క్రీస్తు మనస్సు కలిగినవారము" (1కొరింధీ 2:14-16).

"మనము దేవుని సంబంధులము. దేవుని ఎరిగినవాడు మనమాట వినును, దేవుని సంబంధి కానివాడు మనమాట వినడు. ఇందువలన మనము సత్యరూపమైన ఆత్మయేదో, భ్రమపర్చు ఆత్మయేదో తెలుసు కొనుచున్నాము" (1యోహా 4:6). క్రొత్త నిబంధన క్రైస్తవులను ఆత్మసంబంధులని పిలుచుచున్నది. గనుక "యేసు నారాజ్యము ఈలోక సంబంధమైనది కాదు" అని చెప్పినఆయన సంఘములో (యోహాను 18:36) ప్రకృతి సంభంధమైన వాయిద్య సంగీతముతో కాదు గాని దేవుడు కోరునట్టి ఆత్మ సంబంధమైన గాత్ర సంగీతముతో ఆయనను ఆరాధింప బద్ధుడవై యున్నావు."నేను మీకాజ్ఞాపించు వాటిని చేసిన యెడల మీరు నాకు నిజముగా స్నేహితులై యుందురు" (యోహా 15:14).

కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును, దేవునికి అనుకూలమైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈలోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతము పొందుడి (రోమా 12:1-2).

రెండు సం॥ల క్రితము ఆంధ్రప్రభ దిన పత్రికలో సంగీతమును గూర్చి ఒక చిన్న వ్యాసమును ప్రచురించిరి. దానిని ఈ క్రింద వ్రాయుచున్నాను:

సప్తస్వరాల సంగీతము ప్రకృతి నుంచే పుట్టింది. రాప్కైనా, ఇంకేరాగానికైనా సప్తస్వరాలే ఆధారం. స,రి,గ,మ,ప,ద,ని,లు లేకుండా గాన కళే ఉండదు. ఈ సప్తస్వరాలు ఎక్కడ నుంచి వచ్చాయో చూడండి.

స-షడ్గమము = నెమలి కూత.
రి-రిషభము = వృషభ ధ్వని.
గ-గాంధారము = మేక అరుపు
మ-మధమము = క్రౌంచ పక్షిపలుకు.
ప-పంచమము = కోకిల కులుకు.
ద-దైవతము = గుర్రపు సకిలింపు.
ని-నిషాదము = ఏనుగు ఘీంకరింపు.

ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైననూ కొదువ యున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడు వాడుకాడు (అ.కా. 17:25). సంఘమునకు శిరస్సయున్న క్రీస్తును, యాంత్రిక సంగీతముతో గాక గాత్ర సంగీతముతో దేవుని ఆరాధించు వారమై యున్నాము.

మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక, దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండవలెనని, నేను మాటలాడినను సువార్త ప్రకటించినను, జ్ఞానయుక్తమైన తియ్యని మాటలను వినియోగింపక, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనపరచు దృష్టాంతములనే వినియోగించితిని (1కొరింధీ 2:5). కృప మీ అందరికి తోడైయుండును గాక (తీతు 3:15).

- యన్. ఏలియా, దేవగుప్తం.

- 0 -

గమనిక:- ఈ అంశముపై పలువురు పంపిన వ్యాసములను స్థలాభావము వలన ఈ సంచికలో ప్రచురించలేక పోవుచున్నాము.

- ఎడిటర్.

ఇది దేవుని వాక్యము గనుక మానవుని యెడల దేవుని చిత్తమేదో అది వివరించుచున్నది. అది విధేయులైనవారికి రక్షణ, వెలుగు, ఆదరణ, బుద్ధి, జ్ఞానము స్వరసంపదలు, వాగ్దానములు అనుగ్రహించును.

దేవుని వాక్యము సజీవమైనది. అది బలముగలది. దానిని చదువునప్పుడు దానికి విధేయులమైనప్పుడు మనము ఆశీర్వాదములు పొందగలము (హెబ్రీ 4:12). బైబిలు మానవ జ్ఞానమునకు అతీతమైనది. భూమి గుండ్రముగా నున్నదని, శూన్యముపై దేవుడు భూమిని వ్రేలాడడజేసెనుఅను ఆధునిక విజ్ఞాన శాస్త్రవిషయాలు కొన్నివేల సంవత్సరముల క్రితమే బైబిలునందు వ్రాయబడెను (యోబు 37:12; 26:7).

బైబిలు దేవుని నిజతత్వమును, దేవుని గూర్చిన యధార్థ సమాచారమును తెలియ జేయుచున్నది. సృష్టిద్వారా, వాక్యము ద్వారా మరియు క్రీస్తుద్వారా దేవుడు తన్నుతాను బయలు పరచుకొనెను. మానవుడు ఎవరో, అతని బాధ్యత ఏమిటో అతడు మరణించిన తరువాత ఏమగునో దేవుని వాక్యము తెలియ జేయుచున్నది. బైబిలు వెలుగు ప్రసరించిన చోట మంచి తల్లులు, మంచి తండ్రులు, మంచిపౌరులు తయారయ్యారు. బైబిలు లేనిచోట మతకలహాలు ద్వేషము, అశాంతి స్పష్టంగా కనపడుచున్నవి. మూఢాచారములకు స్వస్తి పలికించింది బైబిలు ప్రభావమే. ఎందుకంటే అది దేవుని వాక్యము. బైబిలు సార్వజనికమైనది అంటే అందరిది. అది చదివి, విధేయులై ధన్యులు కావాలని సోదరులు హెచ్చరించిరి

సోదరులు టి. క్రిష్టాఫర్ ఫ్లెమింగ్స్ గారు, వారి సతీమణి, మరియు స్థానిక సంఘము మంచి ఆతిధ్యమిచ్చిరి. ఫ్లెమింగ్స్ గారు పెద్దాపురం, గుడివాడ, దొడ్డిగుంట, క్రొత్తనాయకంపల్లి మొదలగు గ్రామాలలో సువార్త చాటుచున్నారు.

సెప్టెంబరు 21వ తేదీనాడు నర్సారావ్‌పేట దగ్గరనున్న జొన్నలగడ్డలో ఆంధ్రా క్రిష్టియన్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ వారు ఏర్పాటు చేసిన కూటములో

సోదరులు జాషువా గారు, విక్టర్ దానియేలు తురాకా గారు వాక్య పరిచర్య చేసిరి. సోదరులు పి.డి.యస్. ప్రసాదరావ్ గారు ఈ స్కూలును చక్కగా నడుపుచున్నారు. గుంటూరు జిల్లాలో షార్ట్ టర్మ్ బైబిలు ట్రయినింగ్ నిచ్చే మరొక స్కూలు ఏర్పడుట క్రీస్తు సంఘములకు శుభవార్తయే.

అక్టోబరు నెల సువార్తికుల సదస్సు తూర్పు గోదావరి జిల్లా అల్లవరం మండలం, దేవగుప్తంలో 24వ తేదీనాడు జరుగును. ఆరోజు యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఏల నమ్మవలెను? అను అంశము చర్చించబడును. అదే రోజున దేవగుప్తంలో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయము తెరువబడును. అందరూ ఆహ్వానితులే.

---

Regd. No. H / KD-45 / K.D. H.O
Date of Posting : 15 th of Every month

**From:**
**SATYA WAKKU**
**P.O. Box 80**
**KAKINADA - 533 001**

**To**